సాక్షి అనంతపురం

మంగళవారం । 18 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.26,120

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,120 పలికాయి.



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 6, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

సూపర్ స్పెషాలిటీలో పీడియాట్రిక్ సర్జరీ విభాగం



పీడియాట్రిక్ సర్జరీ విభాగాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన పీడియాట్రిక్ సర్జరీ విభాగాన్ని సోమవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి సూపర్ స్పెషాలిటీకి పీడియాట్రిక్ సర్జరీ విభాగాన్ని మార్చామన్నారు. వారంలో మూడు రోజుల పాటు ఓపీ, మూడు రోజుల పాటు శస్త్రచికిత్సలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. చిన్నారుల్లో హెర్నియా, మూత్రనాళం, మలనాళం, అపెండిసైటిస్ తదితర సమస్యలకు శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఫైళ్ల దగ్ధంపై ఉన్నతాధికారుల విచారణ

- క్లూస్ టీంతో పోలీసుల దర్యాప్తు



దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక పోలీసు బృందం (ఇన్‌సెట్‌లో) కాలిపోయిన ఫైళ్లు

ఉరవకొండ: స్థానిక వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటనపై ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సోమవారం ఏడీఏ కార్యాలయంలో క్లూస్ టీంతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. ఘటనపై వ్యవసాయ శాఖ ఏడీ పద్మజ విలేకర్లతో మాట్లాడారు. ఆదివారం రాత్రి కార్యాలయంలో ప్రమాదం సంభవించిందని ఏఈఓ భరత్ ద్వారా సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశామన్నారు. అనంతరం సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో కార్యాలయానికి చేరుకుని ఫైళ్లు పరిశీలించినట్లు తెలిపారు. డిసెంబర్ 2021 వరకు డిపార్ట్‌మెంట్ ఆడిట్ జరిగిందని, ఆ ఫైళ్లు మొత్తం భద్రంగా ఉన్నాయన్నారు. 2013 తరువాత ఫైళ్లు కొన్ని కాలిపోయినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం కాలిపోయిన వాటిలో ఎక్కువ శాతం రైతులకు అవగాహన కల్పించే కరపత్రాలు, బుక్‌లెట్‌లు ఉన్నాయన్నారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

నిలకడగా చింత పండు ధరలు



హిందూపురం మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: చింతపండు ధరలు మార్కెట్‌లో నిలకడగా కొనసాగుతున్నాయి. సోమవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 1991.70 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు.ఇందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ. 30 వేలు, కనిష్టంగా రూ.8,200, సగటున రూ.15 వేల ప్రకారం ధర పలికింది. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ. 12,500, కనిష్టంగా రూ. 4,500, సగటు రూ.7 వేల ప్రకారం క్రయవిక్రయాలు సాగాయి.

పదో తరగతి విద్యార్థులకు గాయాలు

బొమ్మనహాళ్: పరీక్షలు రాసి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు బొమ్మనహాళ్, ఉద్దేహాళ్‌లోని పరీక్ష కేంద్రాలను కేటాయించారు. దీంతో సోమవారం ప్రారంభమైన తొలి పరీక్షకు విద్యార్థులు రంజిత్, సురేష్‌తో పాటు మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై పరీక్ష కేంద్రానికి వచ్చారు. అనంతరం తిరుగు ప్రయాణమైన వారు గోవిందవాడ గ్రామం వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఘటనలో రంజిత్, సురేష్‌కు బలమైన గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పరీక్షల వేళ సకాలంలో బస్సులను నడపడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని, ఫలితంగా పిల్లలు ద్విచక్రవాహనంపై పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా ప్రదక్షిణ వేదిక

- ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో అర్జీల కుప్పలు
- రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా వినతులు
- తిరిగితిరిగి విసిగిపోతున్న బాధితులు
- కాగితాల్లో మాత్రం పరిష్కరించినట్లు చూపుతున్న అధికారులు
- యంత్రాంగం తీరుపై సర్వత్రా విమర్శలు



అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో క్యూ కట్టిన ప్రజలు



ఇతని పేరు కె.ఈశ్వరరెడ్డి. యాడికి మండలం పి.వెంగన్నపల్లి గ్రామం. వుప్పాల గ్రామ పొలం సర్వే నంబరు 554/2లో ఈయనకు 3.51 ఎకరాల పట్టా భూమి ఉంది. సర్వే చేసిన క్రమంలో 1బీ, అడంగల్‌లో భూమి స్వభావం తప్పుగా నమోదు చేశారు. వారసత్వం అని కాకుండా ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ రిమార్కుల్లో సెక్షన్ 22ఏ 1(ఏ)గా నమోదు చేశారు. ‘భూమి వారసత్వంగా వచ్చింది. 1బీ, అడంగల్‌లో మార్పు చేయండి’ అంటూ తహసీల్దారు కార్యాలయం చుట్టూ ఆరు నెలలుగా తిరుగుతున్నా న్యాయం జరగలేదు. దీంతో తన సమస్యను కలెక్టర్‌కు చెప్పుకుందామని సోమవారం కలెక్టరేట్‌కు వచ్చాడు.



ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు చిన్ననరసింహులు. రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామం. యర్రగంట గ్రామ పొలం సర్వే నంబరు 380–1లో నాలుగు ఎకరాల భూమికి ప్రభుత్వం ఈయనకు డీ పట్టా మంజూరు చేసింది. అయితే ఇందులో ఒక ఎకరాను ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించడమే కాకుండా విక్రయించేందుకు సిద్ధపడ్డారు. సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలంటూ చిన్న నరసింహులు మండల అధికారుల చుట్టూ తిరిగితిరిగి విసిగి వేసారి పోయాడు. సోమవారం కలెక్టరేట్‌కు వచ్చాడు.

అనంతపురం అర్బన్: ‘అయ్యా సమస్యలు పరిష్కరించండి’ అంటూ ప్రజలు ఎంతో ఆశతో తమ చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి కార్యాలయాల వరకూ అర్జీలిస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ బాధితులు వాపోతున్నారు. ప్రతి వారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి దాదాపు 400 వరకు అర్జీలు అందుతున్నాయి. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కూడా మొత్తం 380 వినతిపత్రాలు అందాయి. ఆరు నెలలుగా తిరుగుతున్నాను అని ఒకరు... ఏడాదిగా తిరుగుతున్నానని మరొకరు... అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఇంకొకరు.. ఇలా బాధితులు తమ ఆవేదన వెళ్లబోసుకున్నారు.

కాగితాల్లోనే పరిష్కారం : క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం అంతంత మాత్రంగా ఉంటే... కాగితాల్లో మాత్రం బ్రహ్మాండంగా ఉన్నట్లు చూపిస్తుండటం గమనార్హం. అధికారిక నివేదిక ప్రకారం గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’లో 87 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 29,231 అర్జీలు అందాయి. వీటిలో 26,219 అర్జీలు పరిష్కరించినట్లుగా, 3,012 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లుగా చూపించారు. సమస్య పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ నెలలు, ఏళ్లుగా తిరుగుతున్నామంటూ ఒకవైపు బాధితులు చెబుతుంటే... అధికారులు మాత్రం 98 శాతం పరిష్కరించినట్లు చెబుతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రెవెన్యూవే అధికం.. : ‘పరిష్కార వేదిక’లో అందుతున్న అర్జీల్లో రెవెన్యూశాఖకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి. గత ఏడాది జూన్ నుంచి అందిన 29,231 అర్జీల్లో రెవెన్యూ శాఖ పరిధిలోనివి 11,743 ఉండటం గమనార్హం. ఆ తర్వాత సర్వే భూ రికార్డుల శాఖ, పోలీసు, పురపాలక, పంచాయతీ రాజ్, పౌర సరఫరాల శాఖలకు సంబంధించినవి ఉన్నాయి.

అధికారిక లెక్కల ప్రకారం గత ఏడాది జూన్ నుంచి అందిన అర్జీలు, పరిష్కారం

శాఖ	అందిన అర్జీలు	పరిష్కారం	పెండింగ్
రెవెన్యూ	11,743	10,004	1,739
సర్వే, భూరికార్డులు	8,634	7,667	967
పోలీసు	2,400	2,321	79
పురపాలక	1,207	1,164	43
పంచాయతీరాజ్	912	875	37
పౌర సరఫరాలు	525	507	18
ఇతర 81 శాఖలు	3,990	3,681	129
మొత్తం	29,231	26,219	3,012



కలెక్టరేట్‌లో అర్జీలు రాయించుకుంటున్న బాధితులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్‌నారాయణ్ శర్మ, ఇతర అధికారులు

దౌర్జన్యంగా బండలు నాటారు



రెండేళ్ల క్రితం మా గ్రామంలోని జగనన్న కాలనీలో (సర్వే నంబర్ 483/4) నా భార్య గొల్ల కవిత పేరున ప్లాట్ నంబరు 15 మంజూరు చేస్తూ పట్టా (ఏఎస్ఏ01934178) ఇచ్చారు. అయితే, ఆ ప్లాట్‌లో వేరొకరు దౌర్జన్యంగా బండలు నాటుకున్నారు. సమస్యను గ్రామ సర్పంచుకు చెప్పినా.. సచివాలయంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

– గొల్ల తిరుపాలు, బొమ్మలాటపల్లి, బుక్కరాయసముద్రం మండలం

పట్టించుకోవడం లేదు



యర్రగుంట పొలం సర్వే నంబరు 380–7లో ఎకరా, 380–6లో 36 సెంట్లు మొత్తం 1.36 ఎకరాలు సాగు చేసుకుంటున్నా. ఈ భూమికి ప్రభుత్వం 2004లో డి.పట్టా, పాసు పుస్తకం మంజూరు చేసింది. భూమిలో బోరు వేసుకుని పంట సాగు చేసుకుంటున్నా. అయితే వెబ్‌ల్యాండ్‌లో మిగులు భూమిగా నమోదు చేశారు. నా వద్ద ఉన్న అన్ని ఆధారాలు సమర్పించి నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– జి.ప్రసాద్, బండమీదపల్లి, రాప్తాడు మండలం

ప్రశాంతంగా పది పరీక్షలు

- తొలిరోజు 638 మంది విద్యార్థుల గైర్హాజరు



అనంతపురంలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 31,169 మంది విద్యార్థులకు గాను 30,531 మంది హాజరయ్యారు. 638 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 30 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డీవైఈఓ శ్రీనివాసరావు వివిధ కేంద్రాలను పరిశీలించారు.

వసతుల్లేక ఇబ్బందులు..

అనంతపురం నగరంలోని నంబర్–1 ఉన్నత పాఠశాల కేంద్రంలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా గదులు కనీసం శుభ్రం చేయలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. జిల్లాలో పరీక్షల నిర్వహణపై ఆర్జేడీ శామ్యూల్ ప్రత్యేక దృష్టి సారించడంతో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లలో గుబులు పట్టుకుంది. దీనికితోడు సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏ కేంద్రాలకు వెళ్లాలనేది ఆర్జేడీ పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నిర్వహణలో పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. చిన్న తప్పు జరిగినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదనే చర్చ విధుల్లో ఉన్న టీచర్ల నుంచి వ్యక్తమవుతోంది.

పటిష్ట బందోబస్తు..

అనంతపురం: పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాల పరిసరాల్లో డ్రోన్లతో పర్యవేక్షించారు. 144 సెక్షన్ పక్కాగా అమలు చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలు పెట్రోలింగ్ చేపట్టాయి. పరీక్షలు ముగిసేంత వరకు జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూసివేయించారు. విద్యార్థులు, పరీక్షల నిర్వహణ అధికారులు, ఆయా పాఠశాల సిబ్బంది మినహా ఎవరినీ పరిసర ప్రాంతాల్లోకి రానీయలేదు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు

గార్లదిన్నె: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో చిన్న పొరపాటుకూ తావివ్వొద్దని విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ పేర్కొన్నారు. పరీక్షల అధికారులతో సోమవారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్ నుంచి సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష పేపర్లను సకాలంలో జాగ్రత్తగా కేంద్రాలకు తరలించాలన్నారు. పరీక్ష ముగిసిన తరువాత పక్కాగా భద్రపరచాలన్నారు. పేపర్ లీక్ కాకుండా చూసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ‘వేసవి తీవ్రత అధికంగా ఉంటుంది. ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టండి. గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ‘ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డీఏ–జేజీయూఏ)’ పకడ్బందీగా అమలు చేయాలి’ అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పైప్‌లైన్ల మరమ్మతు చేయాలని చెప్పారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండ్లు, ఆస్పత్రులు, రైతు బజార్లు, దేవాలయాలు, మీ సేవ, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

గిరిజన గ్రామాలను బాగుచేయాలి..

‘ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్’ కింద గిరిజనుల గ్రామాలను బాగు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పథకం కింద జిల్లాలో గుండాల తండా, వెంకటంపల్లి చిన్న తండా, వెంకటంపల్లి పెద్ద తండా, చిన్నవరం, నాగులగుడ్డం, నాగులగుడ్డం తండా గ్రామాలను ఎంపిక చేశామన్నారు. వాటిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. జీవనోపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్య, వైద్యం సంపూర్ణ స్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ‘పీఎంఏవై 2.0’ పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ,అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

‘ఓపెన్’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ బాధ్యతలను డీఆర్ఓ నిర్వర్తించాలన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి మానిటర్ చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎంఈఓలు పరీక్షలను పర్యవేక్షించాలని సూచించారు.

మోహన మూర్తీ.. భక్త జన దీప్తి



మోహినీ అవతారంలో ఖాద్రీశుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజైన సోమవారం స్వామి వారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వయ్యారాలు ఒలకబోసే సోయగాలతో, చంకన అమృత భాండాగారాన్ని పెట్టుకొని సుకుమార వేషంలో కనిపించిన శ్రీవారిని దర్శించుకుని భక్తులు తరించారు. ధగధగ మెరిసే పట్టు చీర ధరించి, గుభాళించే కదిరి మల్లెల అలంకరణలో కనిపించిన ఖాద్రీశుని వైభవాన్ని చూస్తే తప్ప చెప్పటం సాధ్యంకాదు. శ్రీవారి కుచ్చుల వాలు జడ ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాల కడలిని మదించి అందులో ఉద్భవించిన అమృతాన్ని సేవించడానికి దేవతాసురులు పోటీ పడగా, అమృతాన్ని పంచడానికి శ్రీమహావిష్ణువే మోహినీ అవతారమెత్తాడని భక్తుల నమ్మకం. ఈ ఉత్సవ ఉభయదారులుగా కోటా గోపాలకృష్ణయ్య గుప్త కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

భక్తుల వద్దకే వసంతవల్లభుడు

తిరు వీధుల దర్శనానంతరం స్వామివారు రాత్రంతా పట్టణంలోని ప్రతి వీధికి వెళ్లి ఆలయానికి రాలేకపోతున్న తన భక్తుల ఇళ్ల వద్దకే వెళ్లి దర్శనమిస్తారు. మంగళవారం సాయంత్రం తిరిగి ఆలయం చేరుకొని అలంకరణ అనంతరం ప్రజా గరుడ సేవలో భాగంగా మరోసారి గరుడవాహనంపై తన భక్తులకు దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీవారి బ్రహ్మ రథోత్సవం ఈ నెల 20న జరగనుంది. ఆలయ అధికారులు ఇప్పటికే తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



పుర వీధుల్లో విహరిస్తున్న నరసింహస్వామి



ఆలయ పరిసరాల్లో భక్తుల కోలాటం



స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

‘పోలీస్ స్పందన’కు 82 వినతులు

అనంతపురం: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 82 వినతులు అందాయి. ఎస్పీ జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడారు. అనంతరం సంబంధిత ఎస్‌హెచ్ఓలకు నేరుగా ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలో ఆయా అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు.

క్లుప్తంగా

బస్టాండ్‌లో బంగారు నగల అపహరణ



సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికురాలి బ్యాగ్‌లోని బంగారు నగలను దుండగులు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి పట్టణానికి చెందిన శ్రావణి, మధుమోహన్ దంపతులు ఆదివారం యాడికిలో జరుగుతున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. రాత్రికి తిరుగు ప్రయాణమై గుత్తి బస్టాండ్‌లో బస్సు దిగారు. ఆ సమయంలో శ్రావణి బ్యాగులోని 10 తులాల బంగారు నెక్లెస్, లాంగ్ చైన్, కమ్మలను దుండుగులు అపహరించారు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన బాధిత దంపతులు చుట్టుపక్కల ఆరా తీసినా ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, బస్టాండ్‌లోని సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఆర్షియా



తాడిపత్రి టౌన్: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు తాడిపత్రిలోని సాయిచైతన్య స్కూల్ విద్యార్థి ఆర్షియా ఎంపికైంది. ఈ మేరకు ఆ పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనరసింహ సోమవారం తెలిపారు. ఈ నెల 16న పులివెందులలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఆర్షియ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించే ఏపీ జట్టులో చోటు దక్కించుకుందన్నారు. ఈ సందర్భంగా ఆర్షియను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం అర్బన్: ఇటీవల జరిగిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో చేసుకున్న ఎంఓయూలకు సంబంధించి రాబోయే మూడు నెలల్లో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ఎంఓయూల అంశంపై సోమవారం కలెక్టరేట్ నుంచి ఉద్యాన శాఖ అధికారులు, కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. కాంక్లేవ్‌లో ఏడు ఎంఓయూలు జరిగాయన్నారు. వీటికి సంబంధించి రాబోయే మూడు నెలలకు కార్యాచరణ ప్రణాళికను ఆయా కంపెనీల ప్రతినిధులు వారంలోపు అందజేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, టెక్నికల్ అధికారి పల్లవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు ఉత్కంఠ



తప్పని తిప్పలు : అనంతపురం పాతూరు నెం.2 ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మండుటెండలో నిరీక్షిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు అందరిలోనూ ఒక్కటే ఉత్కంఠ. ప్రశ్న పత్రం ఎలా ఉంటుంది? సరైన సమాధానాలు రాస్తామా? లేదా? అనే సంశయం అందరినీ వేధించింది. దీనికి తోడు తల్లిదండ్రుల సూచనలు, సలహాలతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఏది ఏమైనా తొలి రోజు జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పరుగో పరుగు : అనంతపురం పాతూరు నెం.2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి పరుగు తీస్తున్న విద్యార్థి



అదిగదిగో : అనంతపురంలోని మారుతీనగర్ కేశవరెడ్డి స్కూల్ వద్ద తమకు కేటాయించిన గది కోసం జాబితాలో అన్వేషిస్తున్న విద్యార్థులు



రిలాక్స్ : గుంతకల్లులోని ఎస్‌జేపీ ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో పరీక్షకు ముందు రిలాక్స్ అవుతున్న విద్యార్థులు



ఇది కదా రిస్క్ : బొమ్మనహాళ్‌లోని పరీక్ష కేంద్రానికి బొలెరో వాహనంలో వచ్చిన గ్రామీణ ప్రాంత విద్యార్థినులు

ప్రకృతి వ్యవసాయంపై 22 నుంచి సదస్సు



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకూ సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి 'మన వ్యవసాయం, పంటలు, వంటలు, ఆరోగ్యం' అంశంతో ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ విడుదల చేసి, మాట్లాడారు. 22న పకృతి వ్యవసాయంపై, 23న పంటలు, వంటలు, ఆరోగ్యంపై, 24న మారుతున్న వాతావరణ పరిస్థితులు– వ్యవసాయంపై సదస్సులు ఉంటాయన్నారు. రోజూ వెయ్యి మంది రైతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు హాజరై ప్రకృతి వ్యవసాయంపై కొత్త విషయాలను వివరిస్తారని, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో కలసి నిర్వహిస్తున్న సదస్సును సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ సంచుల కలకలం

- అర కిలోమీటరు దూరంతో మూడు సంచులు
- రైల్వే, సివిల్ పోలీసుల పరుగులు
- బస్తాల్లో బయటపడిన మేక పిల్లల కళేబరాలు





యర్రంపల్లి రైల్వే వంతెన కింద పడేసిన ప్లాస్టిక్ బస్తా, కేబుల్ కోసం తవ్విన గుంతలో ప్లాస్టిక్ బస్తా

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని నిర్జన ప్రదేశాల్లో ప్లాస్టిక్ బస్తా నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. విషయం తెలుసుకున్న సీకేపల్లి సివిల్, హిందూపురం రైల్వే పోలీసులు ఉరుకుల పరుగులతో గాలింపు చేపట్టారు. అయితే ఒకటి కాదు... రెండు కాదు... అర కిలోమీటరుకు ఒకటి చొప్పున పడేసిన మూడు ప్లాస్టిక్ బస్తాల్లో నుంచి కుళ్లిన దుర్వాసన వెలువడుతుండడంతో పోలీసులు ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు.

ఏడు గంటల పాటు ఉత్కంఠ

చెన్నేకొత్తపల్లి సమీపంలో ఉన్న యర్రంపల్లి రైల్వే వంతెన కింద ప్లాస్టిక్ సంచి నుంచి దుర్వాసన వస్తున్న విషయాన్ని పసిగట్టిన స్థానికుల సమాచారంతో ధర్మవరం రైల్వే సీఐ అశోక్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ, హిందూపురం రైల్వే ఎస్ఐ సాయినాథ్‌రెడ్డి, ఐడబ్ల్యూ రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి, కానిస్టేబుల్ రమేష్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. అదే సమయంలో అక్కడికి అర కిలోమీటర్ దూరంలో మరో బస్తా నుంచి దుర్వాసన వస్తోందని తెలుసుకున్న పోలీసులు ఒక్కసారిగా ఆందోళనతో అక్కడకు పరుగు తీశారు. కేబుల్ కోసం తీసిన గుంతలో ప్లాస్టిక్ బస్తాను గుర్తించి వెలికి తీశారు. ఈ లోపు అక్కడికి అర కిలోమీటర్ దూరంలో మరో బస్తా నుంచి దుర్వాసన వస్తోందని తెలుసుకుని అక్కడకూ ఆగమేఘాలపై చేరుకున్నారు. బస్తాల పరిమాణాన్ని బట్టి ముగ్గురు వ్యక్తులను హతమార్చి ప్లాస్టిక్ సంచుల్లో కూరి పడేశారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దాదాపు ఏడు గంటల పాటు యర్రంపల్లి వద్ద ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందిన తర్వాత ఒక్కో బస్తాను తెరిచి చూసిన పోలీసులు అవాక్కయ్యారు. అందులో అందరూ ఊహించినట్లుగా వ్యక్తుల మృతదేహాలు కాకుండా మేక పిల్లల కళేబరాలు బయటపడడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇలా ఎందుకు చేశారు? ఎవరు చేశారు? అనేది తేలాల్సి ఉంది.

హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేయాల్సిందే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్



ఇంద్రావతి వద్ద హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న రాంభూపాల్

ఉరవకొండ: హంద్రీ-నీవా కాలువను 10 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యంతో వెడల్పు చేసి తీరాల్సిందేనని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. అలాగే పంట కాలువలు తవ్వి ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నారు. ఉరవకొండ మండలం ఇంద్రావతి, ముష్టూరు గ్రామాల్లో హంద్రీ-నీవా కాలువను సోమవారం సీపీఎం నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీమ అభివృద్ధికి సాగునీటి వనరులే కీలకమన్నారు. హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ పనులు ప్రారంభించే ముందు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పది వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యానికి కాలువను వెడల్పు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత డిజైన్ 3,850 క్యూసెక్కుల కంటే తక్కువకు కుదించి లైనింగ్ పనులు చేపడితే అది రైతులకు మరణ శాసనమవుతుందన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చడంతో పాటు హంద్రీ-నీవా డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి ఆయకట్టును స్థిరీకరించాలన్నారు. ఈ విషయంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, మధుసూదన్, శ్రీనివాసులు, కౌలు రైతు సంఘం నాయకులు పెద్దముష్టూరు వెంకటేష్, మురళి, రామాంజినేయులు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘా.. అంతా బాగా

అనంతపురం: ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో పోలీసులు డ్రోన్లతో నిఘా వేశారు. సోమవారం సాయినగర్, ఎస్ఎస్‌బీఎన్, కేఎస్ఆర్ కళాశాల, సుభాష్ రోడ్డు, క్లాక్ టవర్ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేశారు. నేరాల నియంత్రణ, ఈవ్ టీజింగ్ జరగకుండా కట్టడి చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డుపై అడ్డదిడ్డంగా తోపుడుబండ్లు పెట్టకుండా చర్యలు తీసుకున్నారు.



జిల్లా కేంద్రంలోని ఓ వీధిని డ్రోన్ తీసిన చిత్రం

సమస్యలు పరిష్కరించాలి

- ఎన్టీఆర్ వైద్యసేవ ఆరోగ్యమిత్రల నిరసన



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఆరోగ్యమిత్రలు

అనంతపురం అర్బన్: తమ ప్రధాన సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్యసేవ ఆరోగ్యమిత్రలు విధులు బహిష్కరించి సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో ఆరోగ్యమిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, సీసీ డీఈఓలుగా పనిచేస్తున్న వారికి 17 ఏళ్లుగా క్యాడర్ అమలు చేయకపోవడంతో ఎంటీఎస్ అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగిగా గుర్తింపు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యసేవ ఉద్యోగులు విధి నిర్వహణలో చనిపోతే వారి కుటుంబాలకు సాధారణ వ్యక్తికి చెల్లించినట్లే ఎక్స్‌గేషియాతో సరిపెడుతూ ఇతర ఎలాంటి ప్రయోజనాలు అందివ్వడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ లేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు లేవన్నారు. ప్రభుత్వ సైట్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తుండడంతో సంక్షేమ పథకాలు కూడా అందడం లేదన్నారు. తమ ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు అరుణ, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి



మాట్లాడుతున్న ఏపీ మీటర్ రీడర్స్ సంఘం నాయకులు

ధర్మవరం: మీటర్ రీడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలని ఏపీ మీటర్ రీడర్స్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎర్రమశెట్టి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మీటర్ రీడర్లు ప్రతి నెలా వచ్చే కమీషన్‌ల ద్వారా పూట గడవడం దుర్భరంగా మారుతోందన్నారు. ఉద్యోగభద్రత కోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించక పోగా రీచార్జ్ మీటర్‌లు ఏర్పాటు చేసి మీటర్ రీడర్ల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. మీటర్ రీడర్ల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18న డీఈ కార్యాలయాన్ని, 20న ఎస్ఈ కార్యాలయాన్ని, 27న సీఎండీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు దస్తగిరి, రాజు, జగదీష్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ అష్రఫ్‌అలీ, ఎస్ఐ శివ

బొమ్మనహాళ్: మండలంలోని దుద్దేకుంట గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. బెళుగుప్పలోని పరీక్ష కేంద్రానికి గ్రామం నుంచి ఆటోలో బయలుదేరిన విద్యార్థులు... అంకంపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సును డ్రైవర్ తప్పించబోవడంతో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి దూసుకెళ్లింది. ఘటనలో స్వల్ప గాయాలతో విద్యార్థులు బయటపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టి విద్యార్థులకు ధైర్యం చెప్పారు. ఆటోను తిరిగి రోడ్డుపైకి చేర్చి విద్యార్థులను సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చారు. కాగా, విషయం తెలుసుకున్న డీఎస్పీ అష్రఫ్ అలీ, ఎస్ఐ శివ పరీక్షా కేంద్రం వద్దకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం ఆటో డ్రైవర్లతో సమావేశమై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్య పరిచారు. కాగా, బస్సులను ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ అధికారులు విఫలం కావడంతోనే పిల్లలను ఆటోల ద్వారా పరీక్ష కేంద్రాలకు పంపాల్సి వస్తోందని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో 'అనంత' ప్రతిభ



రన్నర్స్ ట్రోఫీతో జిల్లా బాలికల జట్టు

గుంతకల్లు: వైఎస్సార్ జిల్లా పులివెందుల వేదికగా జరిగిన 34వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అనంతపురం జిల్లా బాలికల జట్టు రన్నరప్‌ను దక్కించుకుంది. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల కబడ్డీ పోటీలు జరిగాయి. ఫైనల్‌లో శ్రీకాకుళం జట్టుతో తలపడిన అనంత జట్టు ఒక్క పాయింట్ తేడాతో విజయాన్ని చేజార్చుకుంది. కాగా, రన్నర్స్ ట్రోఫీని దక్కించుకున్న జిల్లా జట్టును కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

ప్రమాదంలో యువకుడి మృతి

బెళుగుప్ప: మండలంలోని బి.రామసాగరం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బెళుగుప్పకు చెందిన బోయ చంద్రన్న కుమారుడు సతీష్‌కుమార్ (19) అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఇటీవల ఇంటికి వచ్చాడు. తనతో పాటు అదే కళాశాలలో చదువుకున్న స్నేహితుడు, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోట గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌తో కలసి సోమవారం ఉరవకొండ మండలం వై.రాంపురంలో ఎర్రితాత రథోత్సవానికి వెళ్లాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు బి.రామసాగరం క్రాస్ వద్దకుచేరుకోగానే అదుపు తప్పి కిందపడ్డారు. చీకటిలో అటుగా వచ్చిన కొందరు గుర్తించి కుటుంబసభ్యులకు విషయం తెలిసి, 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సతీష్‌కుమార్ మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్‌కు చికిత్సలు అందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవు



ఆటో డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న పోలీసులు

అనంతపురం: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సురక్షితంగా గమ్యం చేర్చాలని, అయితే పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థుల అవసరాన్ని అవకాశంగా తీసుకుని పరిమితికి మించి ఆటోల్లో తరలించరాదన్నారు. ఆటో నడిపే ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు ఆపి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించరాదన్నారు. ప్రయాణికులను ఎక్కించుకునేటప్పుడు, దించేటప్పుడు రోడ్డుకు పూర్తిగా పక్కకు వెళ్లి ఆపాలన్నారు.

ప్రహ్లాద సమేత నారసింహుడు ఇక్కడే..



కదిరి: నవ నారసింహ క్షేత్రాల్లో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం కూడా ఒకటి. ఇక్కడ స్వామివారు నిత్య పూజలతో వెలుగొందుతున్నారు. అయితే తన ప్రియభక్తుడు ప్రహ్లాదుడితో కలసి ఉన్న నరసింహస్వామి దర్శనం కదిరిలో తప్ప దేశంలో మరెక్కడా లేదు. నారసింహుడికి ఎడమ వైపు ప్రహ్లాదుడు నిల్చొని ఉండడం ఇక్కడ చూడవచ్చు. 'భక్త ప్రహ్లాద సమేత నారసింహుడి దర్శనం..పాప విమోచనం' అని ఇక్కడి అర్చక పండితులు చెబుతున్నారు. సైన్స్‌కు కూడా అంతుచిక్కని దైవ రహస్యం మరొకటి ఇక్కడ గమనించవచ్చు. ఇక్కడి మూలవిరాట్‌కు ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు మాత్రమే అభిషేకం చేస్తారు. అభిషేకం చేసిన అనంతరం మూలవిరాట్ నుంచి స్వేద బిందువులు బయటకు వస్తుంటాయి. వస్త్రంతో ఆ స్వేదాన్ని తుడిచినా మళ్లీ వస్తూ ఉంటుంది. స్వామివారు ఇక్కడ నిజరూపంలో ఉన్నారని చెప్పడానికే ఇలా స్వేద బిందువులు వస్తుంటాయని భక్తుల నమ్మకం.



భక్త ప్రహ్లాద సమేత నారసింహుడు

క్లుప్తంగా

డీఆర్‌డీఏకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లు అందజేస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

అనంతపురం అర్బన్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) యాక్టివిటీ కింద రూ.2 లక్షలు విలువ చేసే మూడు కంప్యూటర్లు, ఒక ప్రింటర్‌ను కెనరా బ్యాంక్ డీఆర్‌డీఏకు సమకూర్చింది. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా డీఆర్‌డీఏ పీడీకి కంప్యూటర్లు, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎస్ఆర్ కింద విరివిగా సేవ కార్యక్రమాలు చేపట్టాలని కంపెనీలకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, కెనరా బ్యాంక్ తిరుపతి సర్కిల్ జీఎం పాండురంగ మిథనయ్య, ఏజీఎం లారెన్స్, ఎల్‌డీఎం నర్సింగరావు, ఆర్‌ఓ సీనియర్ మేనేజర్ బీవీమను, తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డు తొలగించాలి



ఎమ్మెల్యే దగ్గుపాటితో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డును తొలగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ఆవరణలో ధర్నా చేపట్టారు. నడిమి, మరువ వంకలకు సైడ్ వాల్ ఏర్పాటు చేయాలని కోరారు. కంపోస్టు ద్వారా వచ్చే పొగతో గుత్తి రోడ్డు, రాజీవ్ కాలనీ, ఎర్రనేల కొట్టాలు, తదితర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు కంపోస్టు యార్డును తరలిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చెప్పారన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం బడ్జెట్ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామిరెడ్డి, వెంకట నారాయణ, ముత్తూజ, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, వలీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్ట్

రాప్తాడురూరల్: బరి తెగించిన దొంగలు కటకటాలపాలయ్యారు. ఇటీవల అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి రాచానపల్లి వద్ద మూడు దుకాణాల్లో తెగబడిన దొంగలను అనంతపురం రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను ఎస్ఐ వలి వెల్లడించారు. నగరంలోని నవోదయ కాలనీకి చెందిన చాంద్‌బాషా, రుద్రంపేటకు చెందిన తుషార్, నవోదయ కాలనీకి చెందిన జువైనల్ స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో రాచానపల్లి సమీపంలో పాన్‌సెంటర్, టీషర్టుల దుకాణం, పచ్చి టెంకాయల దుకాణాల షెటర్లకు వేసిన బీగాలను తొలిగించి దొంగతనాలకు పాల్పడ్డారు. నిందితులు అనంతపురం రూరల్ కక్కలపల్లి సమీపంలోని టమాట మండీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15 వేలు విలువ చేసే సిగరెట్లు, వివిధ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని కోర్టులో హాజరుపరిచారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

అనంతపురం: తప్పిపోయిన ఐదేళ్ల బాలుడి ఆచూకీని అనంతపురం వన్‌టౌన్ పోలీసులు గంటన్నర వ్యవధిలో కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. తన కుమారుడు (ఐదు సంవత్సరాల బాలుడు) జోగుల తరుణ్ ఐరన్ బ్రిడ్జి వద్ద తప్పిపోయాడని అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన కీర్తన సోమవారం ఉదయం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడు జిల్లా సర్వజనాసుపత్రి వద్ద ఉన్నట్లు గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి బాలుడిని అప్పగించారు.

పంపనూరు హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. రూ.22,24,832 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. అనంతరం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో అనంతపురం డివిజన్ పర్యావేక్షణ అధికారి వన్నూర్‌స్వామి, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేయర్ వసీం



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

చేతనైతే విచారణ చేయించయ్యా..

- బడ్జెట్ సమావేశంలో అవినీతి పేరుతో రాద్ధాంతం చేస్తారా?
- బయోమైనింగ్‌పై విచారణకు సిద్ధం
- ఇప్పటికే విచారణ చేయాలని కలెక్టర్‌కు చెప్పాం
- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై మేయర్ వసీం ఆగ్రహం
- రూ.135 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

అనంతపురం కార్పొరేషన్: 'గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కంపోస్టు యార్డులో జరిగిన చెత్త నిర్వహణ (బయోమైనింగ్)లో అవినీతి జరిగిందంటున్నారు. కౌన్సిల్ సమావేశాల్లో తరచూ ఇదే విషయంపై పాలకవర్గం, మాజీ ఎమ్మెల్యే అనంతపై నోరు పారేసుకుంటున్నారు. ఆరోపణలు చేసిన రోజు నుంచే విచారణ చేయించి, బయోమైనింగ్ చేసిన ఏజెన్సీకి డబ్బులివ్వాలని చెప్పాం. కానీ ప్రతిసారీ అదే విషయాన్ని మాట్లాడుతూ నానాయాగీ చేస్తే ఎలా? మీ ప్రభుత్వం (కూటమి) ఉంది. చేతనైతే విచారణ చేయించయ్యా? అవినీతి అంటారు.. మళ్లీ ఏజెన్సీకి డబ్బులు ఇవ్వాలంటారు.. అసలు మీ ఆంతర్యమేమిటి' అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై మేయర్ వసీం ధ్వజమెత్తారు. సోమవారం నగరపాలక సంస్థలో బడ్జెట్ సమావేశం జరిగింది. బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి అతిగా జోక్యం చేసుకున్నారు. రూ.వందల కోట్ల బడ్జెట్ ఆమోదంపై చర్చ జరిగే సమయంలో కంపోస్టు యార్డుపై మాట్లాడారు. 'ఈ ఏడాది అక్టోబర్–2 నాటికంతా కంపోస్టు యార్డులోని చెత్త నిర్వహణ చేపట్టడంతో పాటు నూతన కంపోస్టు యార్డు తీసుకొస్తామని చెప్పారు. గతంలో జరిగిన చెత్త నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడటాన్ని మేయర్ తప్పుబట్టారు'. వివరణ ఇవ్వాలని కమిషనర్ బాలస్వామిని మేయర్ కోరగా.. అదే సమయంలో ఏం మాట్లాడాల్సిన పని లేదంటూ కమిషనర్ బాలస్వామికి ఎమ్మెల్యే సైగలు చేశారు. ప్రతిసారీ ఇదే అంశంపై మాట్లాడటం సరికాదని మేయర్ వసీం ఎమ్మెల్యేకు సూచించారు. అందుకు ఎమ్మెల్యే కాసేపు బిగ్గరగా మాట్లాడుతూ.. మరికాసేపటికి నవ్వుతూ (సీరియస్‌నెస్ లేకుండా) అవినీతి జరిగిందని విమర్శలు చేశారు. స్పందించిన మేయర్ వసీం.. సభలో ఏ విధంగా నడుచుకోవాలో తెలియదా? మొదట కూర్చోండి అని చెప్పారు. అనంతరం కమిషనర్ బాలస్వామి బయోమైనింగ్‌పై విచారణ చేపడుతామన్నారు.

రూ.135.18 కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం

నగరపాలక సంస్థ 2024–25 సవరించిన బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.111.57 కోట్లు కాగా.. ఈ ఏడాది కేటాయించిన బడ్జెట్ రూ.135.18 కోట్లకు మేయర్ వసీం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. అందులో నగరపాలక సంస్థ ఆదాయం రూ.115 కోట్లుగా చూపించారు. మూలధనం జమలు రూ.27.31 కోట్లు, మిగులు రూ.33.72 కోట్లుగా చూపించారు. బడ్జెట్‌లో నీటి సరఫరాకు రూ.27.03 కోట్లు, మురుగు కాలువలకు రూ.17.57 కోట్లు, రోడ్ల ఏర్పాటుకు రూ.25.69 కోట్లు, లైట్ల నిర్వహణకు రూ.9.46 కోట్లు, పార్కుల అభివద్ధి నిర్వహణకు రూ.13.51 కోట్లు, మార్కెట్లు, చిన్న పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, మరుగుదొడ్లు తదితర వాటికి రూ.22.98 కోట్లకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

కుక్కల బెడదకు పరిష్కారం చూపాలి..

కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని మేయర్ వసీం, కార్పొరేటర్లు రహంతుల్లా, మల్లెమీద నరసింహులు, కమల్ భూషణ్, తదితరులు కమిషనర్ బాలస్వామిని కోరారు. స్టెరిలైజేషన్‌లో అవినీతి జరిగిందని డిప్యూటీ మేయర్ కోగటం ఆరోపించారు.

10 నెలల్లో ఒక్క అభివృద్ధి పనైనా జరిగిందా?

- ఎమ్మెల్యే దగ్గుపాటిని నిలదీసిన మేయర్, కార్పొరేటర్లు

'గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,200 కోట్ల అభివృద్ధి జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు కావస్తున్నా.. ఒక్క అభివృద్ధి పని అయినా జరిగిందా' అని ఎమ్మెల్యే దగ్గుపాటిని మేయర్ వసీం, కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, కమల్ భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ప్రతిసారీ అవినీతి.. అవినీతి అంటూ మాట్లాడుతున్నారని.. రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లను ఎందుకు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో మళ్లీ ఎమ్మెల్యే గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని.. అప్పట్లో బిల్లులు కాలేదని, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అందరినీ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో వైఎస్సార్‌సీపీ జెండాపై గెలిచి టీడీపీలోకి వెళ్లిన కార్పొరేటర్లు బాబా, బాలాంజనేయులు ఓవరాక్షన్ చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి హయాంలోనే అభివృద్ధి జరిగిందంటూ కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, కమల్ భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డితో వాగ్వాదం చేశారు. చివరకు మేయర్, కమిషనర్ జోక్యం చేసుకుని అనవసర విషయాలపై చర్చ అవసరం లేదని కార్పొరేటర్లు బాలాంజనేయులు, బాబాకు చురకలంటించారు.

కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలు

- సెంట్రల్ పార్క్‌ను సర్వే చేసి, అన్యాక్రాంతమైన నగరపాలక సంస్థకు చెందిన స్థలాన్ని పరిరక్షించాలని కార్పొరేటర్ బండి నాగమణి, అబూసలేహా తదితరులు టీపీఓ శిరీషపై మండిపడ్డారు. సర్వే చేయకుండా సమయం వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- కంపోస్టు యార్డును తరలించాలని కోరుతూ కార్పొరేటర్ లాలూ సభలో బైఠాయించారు.
- ఓవర్ బ్రిడ్జికి నీలం సంజీవ రెడ్డి పేరు కొనసాగించాలని కార్పొరేటర్ గురుశేఖర్ బాబు కోరారు.
- డివిజన్ల వారీగా పారిశుధ్య సిబ్బందిని నియమించాలని కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు సూచించారు. నోరున్న వారికే అధిక సంఖ్యలో సిబ్బందికి కేటాయించడం సరికాదని మండిపడ్డారు.

అభివృద్ధికి పాటుపడదాం

అందరి సహకారంతో నగరాభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 8 మంది కమిషనర్లు మారారని చెబుతున్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకెళ్తాం. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలి. నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్, ఏసీపీలు, ఇంకా వివిధ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– బాలస్వామి, కమిషనర్, నగరపాలక సంస్థ

ఓట్లు వేసి గెలిపిస్తే మోసం చేస్తారా?



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు దాటుతున్నా యువతకు ఉద్యోగం లేదు.. నిరుద్యోగ భృతి లేదంటూ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొత్రేష్ ధ్వజమెత్తారు. తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ ఎప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నించారు. యువతకు ఇచ్చిన హామీల అమలు, ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కొత్రేష్ మాట్లాడుతూ.. హామీలను నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే.. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఇతర శాఖల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ ఉంటుందో ఉండదో కూడా ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్నారు. నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ రూ.3,000 ఊసే లేదన్నారు. ఇప్పటికి 18 కేబినెట్ సమావేశాలు నిర్వహిస్తే ఏఒక్క సమావేశంలోనూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలపై చర్చించకపోవడం సిగ్గుచేటన్నారు. హామీ మేరకు నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. జీఓ 77 రద్దు చేయాలని సూచించారు. గ్రూప్–2 ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవ, సంఘం సహాయ కార్యదర్శి ధనుంజయ, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు రాంబాబు, నాగయ్య, అభి, తదితరులు పాల్గొన్నారు.

సవీర ఆస్పత్రిపై చర్యలు తీసుకోండి



రెవెన్యూ భవన్‌లో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ఉచిత వైద్యం అందించని కిమ్స్ సవీర ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన పరిష్కార వేదికలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి శ్రీరాములు మాటాడుతూ.. కల్పనాజ్యోతి కాలనీకి చెందిన సుజాతకు చాతినొప్పి రావడంతో సవీర ఆసత్రిలో అడ్మిట్ చేశారన్నారు. ఆస్పత్రి యాజమాన్యం రోగి తరఫున వచ్చిన వారితో ఆమె ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని నమోదు చేశారన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహించి యాంజియోగ్రామ్ చేసేందుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశాన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స అందించకుండా డబ్బులు ఎందుకు అడుగుతున్నారని బంధువులు ప్రశ్నిస్తే.. ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని మండిపడ్డారు. ఇక్కడ ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయం, వేరే ఆస్పత్రికి తీసుకెళ్లండని చెప్పి అర్ధరాత్రి రెండు గంటల సమయంలో పంపించి వేశారన్నారు. దీంతో సుజాతను ఆ సమయంలో సాయినగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్తే.. అక్కడ ఆరోగ్యశ్రీ కింద యాంజియోగ్రామ్ చేశారన్నారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సవీర ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అల్లీపీరా, రమణ, జయలక్ష్మి, నారాయణ స్వామి, సుందర రాజు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లను అప్పగించేందుకు చర్యలు

అనంతపురం: యజమాని వివరాలు లేని మోటార్ సైకిళ్లను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ కే.సాయినాథ్ తెలిపారు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నవంబర్ 9, 2023 వరకు పలు వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ భవనాలు, రహదారుల వద్ద వదిలేసిన బైక్‌లను అన్‌క్లైమ్డ్ కింద పోలీసు స్టేషన్‌లో భద్రపరచడం జరిగిందని తెలిపారు. వాటిలో కొన్నింటిని యజమానుల వివరాలు తెలుసుకుని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఇంకా 49 బైక్‌లకు సంబంధించి యజమానుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ద్విచక్ర వాహనాలు స్టేషన్‌లో ఉన్నట్లయితే సంబంధిత పత్రాలు ఇస్తే వారికి వాహనాలు ఇచ్చేస్తామని పేర్కొన్నారు. వాహన యజమానులు గుర్తించడానికి సాధ్యం కాని పరిస్థితుల్లో కోర్టు అనుమతితో బైక్‌లను వేలం వేస్తామన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలి కల్లుగీత కార్మికులు కోరారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే దగ్గుపాట వెంకటేశ్వర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికుల ముద్దు బిడ్డ సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్య్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. నగరంలో గౌతు లచ్చన్న ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నారాయణ స్వామి, శ్రీరాములు, ఆదినారాయణ, వెంకటేష్, లాలెప్ప, రఘు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వాహనాల తనిఖీ

అనంతపురం: విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా జిల్లాలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్ల డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లకు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనపై పోలీసులు చర్యలు చేపట్టారు.

ఎస్ఐకు సన్మానం

అనంతపురం: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐగా పని చేస్తున్న గోపాలుడు విజిలెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. శింగనమల ఎస్ఐగా పని చేస్తున్న శరత్ చంద్ర మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోపాలుడిని సీఐ శాంతిలాల్ సత్కరించారు.

క్రమశిక్షణతోనే విజయం సాధ్యం

అనంతపురం: క్రమశిక్షణతోనే విజయం సాధ్యమని పతంజలి యోగా పీఠాధిపతి స్వామి రిత్‌దేవ్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఒత్తిడి తగ్గించే యోగసాధనాలను వివరించారు. ఆధునిక జీవితంలో విద్యార్థినులు బాల్యదశ నుంచి వృద్ధాప్యం వరకూ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీటిని ఎదుర్కోవాలంటే దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

అనంతపురం: నగరంలోని హౌసింగ్ బోర్డు అభయ ఆంజనేయస్వామి ఆలయం పరిసరాల్లో నివాసం ఉంటూ మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ అదృశ్యమైనట్లు టూ టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. ఆచూకీ తెలిసిన వారు 9440796806, 7981653733 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వ్యాసరాజ ఆరాధన ప్రారంభం



కోలాటం ఆడుతున్న మహిళలు

అనంతపురం కల్చరల్: హైందవ ధర్మ ప్రచారకుడు వ్యాసరాజ ఆరాధన ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడవ రోడ్డులోని ఉడుపి కృష్ణమఠంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. వందలాది మంది భక్తులు పురవీధుల్లో రథాన్ని లాగారు. నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య నేతృత్వంలో కళాకారులు నిర్వహించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. పురంధర, త్యాగయ్య, అన్నమయ్య గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా తేజవార మఠం పీఠాధిపతి విశ్వప్రియ తీర్థులు ఆత్మీయ అతిథిగా విచ్చేసి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.

నేడు చలో ములకలేడు

అనంతపురం అర్బన్: శెట్టూరు మండలం ములకలేడులో అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రారంభించాలనే డిమాండ్‌తో మంగళవారం చలో ములకలేడు కార్యక్రమం చేపట్టామని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న, మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. శెట్టూరు మండలం ముకలేడులో గురుకుల పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ఇప్పటి వరకు పాఠశాలను ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. దాదాపు 240 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో గురుకుల పాఠశాల ప్రారంభించాలనే డిమాండ్‌తో చేపట్టిన చలో ములకలేడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

అనంతపురం అర్బన్: కారుణ్య నియామం కింద ఒకరికి ఉద్యోగం కల్పిస్తూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సోమవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉరవకొండ మండలం వై.రాంపురం గ్రామానికి చెందిన ఎస్సీ వర్గానికి చెందిన ఎల్లన్న 2021లో హత్యకు గురయ్యారు. జీఓ 95 ప్రకారం ఎల్లన్న కుమారుడు నవీన్‌కు ఉద్యోగ అవకాశం కల్పించారు. చాబాలలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో వంట మనిషిగా నియమించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రాధిక, ఇతర అధికారులు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



పూజలందుకున్న వినాయకుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం రాత్రి సంకష్టహర చతుర్థి వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు బారులు తీరి వ్రతం ఆచరించారు. అర్చకులు వినాయకుడికి అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించి అనంతరం వ్రతకథలను వినిపించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి నైవేద్యంగా పెట్టిన మోదకాలను భక్తులకు వితరణ చేశారు. వినాయక చవితిని తలపిస్తూ ఎస్కేయూ రోడ్డులోని శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అలాగే పాతూరు చెరువుకట్ట, రజక నగర్ సంకష్టహర వినాయక ఆలయం, మారుతీనగర్ రామాలయం, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం తదితర చోట్ల వ్రతం నిర్వహించారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖర బాబు నేతృత్వంలో సంకష్టహర వేడుకలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


పదో తరగతి పరీక్షలు ప్రారంభం

రాప్తాడు: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. రాప్తాడు మండలంలో నాలుగు సెంటర్లలో మొదటి రోజు పరీక్షకు 932 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 921 మంది హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. ఆయా కేంద్రాలను మొదటి రోజు స్కాడ్ టీంలు పర్యవేక్షించాయి. మండలంలో నాలుగు సెంటర్ల వద్ద సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ మల్లికార్జున మాట్లాడుతూ.. పరీక్షలను ప్రశాంతగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్లను మూసివేయించామన్నారు. పరీక్షా కేంద్రాలకు కాలిక్యులేటర్, బ్లూటూత్, సెల్‌ఫోన్‌తో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు. మరుగుదొడ్లతో పాటు ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు.

ఆత్మకూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 533 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

తమ్ముళ్ల మట్టి దోపిడీ

- మదిగుబ్బ అక్కమ్మ కొండను తోడేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



టిప్పర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆత్మకూరు మండలంలోని టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని యథేచ్ఛగా మట్టి దందా సాగిస్తున్నారు. మదిగుబ్బ గ్రామంలో అక్కమ్మ దేవతల ఆలయం పక్కనే (217 సర్వే నంబర్) గల అమ్మవారి గుట్ట ఉంది. ఆ కొండపై టీడీపీ నేతల కన్ను పడింది. కొండలోని మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అది ప్రభుత్వ భూమి అయినప్పటికీ టీడీపీ నేతలు ఆదాయమే ధ్యేయంగా చేసుకుని కొండను కరిగిస్తున్నారు. కొండపై హిటాచీ ఏర్పాటు చేసుకుని నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లతో మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఒక టిప్పర్ మట్టి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకూ ధర పలుకుతోంది. ఈలెక్కన మట్టితోనే రోజుకు రూ.3 లక్షలకు పైగా ఆర్జిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమంగా కొండ నుంచి మట్టి తొలుకుంటూ రూ.లక్షల్లో టీడీపీ నేతలు దోచుకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ వ్యవహారంలో అధికారులకు కూడా వాటా అందుతోందని సమచారం.

ఆందోళనలో గ్రామస్తులు

ఆలయం పక్కన ఉన్న కొండ మట్టిని రోజూ టిప్పర్లతో తరలిస్తుండటంతో మదిగుబ్బ గ్రామస్తులు మండిపడుతున్నారు. వడ్డుపల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో మట్టి తరలింపు జరుగుతోందని చెబుతున్నారు. ఈ దారిలో అతి వేగంగా టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు.